www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 28 అక్టోబర్ 2025



పరిశ్రమల శంకుస్థాపన వాయిదా



ప్రజాశక్తి -కుప్పం: రాష్ట్రంలో తుపాను కారణంగా భారీ వర్షాల నేపథ్యంలో కుప్పంలో పరిశ్రమల శంకుస్థాపన వాయిదా పడినట్లు కడ పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. మంగళవారం సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో కుప్పంలో ఏడు పరిశ్రమల నిర్మాణానికి సంబంధించి భూమి పూజ చేయాల్సి వుంది. దాదాపు రూ.2203 కోట్ల పెట్టుబడితో 22 వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఏర్పాటు కానున్న పరిశ్రమలకు సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయాల్సి వుంది. అయితే రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిస్థితుల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు.

పునరావాస కేంద్రాలు ఏర్పాటు

- ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా ముందస్తు జాగ్రత్తలు
- ప్రత్యేక అధికారి గిరీషా



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు, సూచనల మేరకు మొంథా తుపాను కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మొంథా తుపాన్ జిల్లా ప్రత్యేక అధికారి పిఎస్ గిరీషా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ప్రత్యేక అధికారి కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి తుపాను ముందస్తు జాగ్రత్త చర్యలు, పునరావాస కేంద్రాల ఏర్పాట్లపై కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో చిత్తూరు మున్సిపాల్టీ కమిషనర్‌తో, ఇరిగేషన్ అధికారులతో కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మొంథా తుపాన్ జిల్లా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ తుపాను ప్రభావిత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, తుపాను షెల్టర్లతో పాటు అవసరమైతే పాఠశాలలు, కళాశాలలు మొదలైన ప్రభుత్వ భవనాలను పునరావాస కేంద్రాలుగా వినియోగించుకోవాలని తెలిపారు. తీరప్రాంత, తుపాను ప్రభావిత గ్రామాల ప్రజలతో పాటు గ్రామాలలో వప్రమాద ఇళ్లలో వున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. తుపాను ప్రభావిత గ్రామాల ప్రజలను తప్పని సరిగా పునరావాస కేంద్రాలకు తరలించాలని, ఏమైనా ఇ బ్బందులు ఎదురైతే పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. పునరావాస కేంద్రానికి తరలించే ప్రజలకు మూడురోజులకు సరిపడా నిత్యావసర సరుకులు ముందే సేకరించి సిద్ధం చేసుకోవాలని, అక్కడే ఆహారం అందించాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలల సిబ్బంది విధులకు హాజరై, పునరావాస విధులలో పాల్గొనాలని ఆదేశించారు. నిత్యావసర సరుకులు చౌకధరల దుకాణాలు లేదా సురక్షిత ప్రాంతాలలో స్టాకు చేసుకోవాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. 108, 104, 102 వాహనాల వివరాలు, వైద్య సిబ్బంది మొబైల్ నంబర్లు వివరాలు కంట్రోల్ రూంలలో సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. హైరిస్క్ గర్భిణులను ముందే ఆస్పత్రుల్లో చేర్పించాలని, వారి సహాయకులకు వసతి సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. ఇతరశాఖల సిబ్బందిని వినియోగించుకోవాలన్నారు. మంచినీరు కలుషితం కాకుండా పైపులను తనిఖీచేయాలని, క్లోరినేషను చేసిన మంచినీటినే ప్రజలకు సరఫరా చేయాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగకు అవసరమైన సిబ్బందిని సిద్ధంచేసుకోవాలని, అగ్నిమాపక సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన వాహనాలను సమకూర్చుకునేందుకు రవాణాశాఖ అధికారులు వివరాలతో సిద్దంగా ఉండాలన్నారు. ప్రమాదకర చెరువులను నిరంతరం పర్యవేక్షిం చాలని, ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షపాతం, నీటి ప్రవాహాన్ని అంచనా వేసుకొని అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గండ్లు పడే అవకాశమున్న, గుర్తించిన ప్రమాదకర ప్రదేశాలలోతక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పశువులకు అవసరమైన దాణాను రైతులకు ముందే అందించాలని సూచించారు. పంటలు, ఆస్తి నష్టం ఏర్పడితే వివరాలను వెంటనే నివేదించాలని, పూర్తి వివరాలను ప్రభుత్వానికి నివేదించేంత వరకు, తదుపరి ఆదేశాల వరకు మండల ప్రత్యేక అధికారులు, సిబ్బంది మండలంలోనే ఉండాలని కలెక్టరు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆర్డబ్ల్యూఎస్ఎస్సి ఈ ప్రసన్న కుమార్, ఎస్సీ ఈ ఇరిగేషన్ వెంకటేశ్వర రాజు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మొంథా తుపాను కారణంగా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు నేడు 28 తేదీ మంగళవారం అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో డీవైఇవో, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయు లను ఆదేశించారు. ఎంఈవోలు మండల కేంద్రాలలో కంట్రోల్ రూమ్‌లో అందుబాటులో ఉండాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

చిత్తూరు అర్బన్ : తుపాను కారణంగా జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం కానీ, ఆస్తి నష్టం కానీ వాటిల్లే అవకాశం లేకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన సహాయక చర్యలు అందించేందుకు అప్రమత్తంగా ఉందని తుపాను పట్ల భయభ్రాంతులను చేసే వదంతులు నమ్మకుండా ప్రశాంతంగా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటన ద్వారా జిల్లా ప్రజలకు సూచించారు. ఈ నెల 28, 29 తేదీల్లో తుపాను ప్రభావం జిల్లాకు కూడా ఉండడంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రాష్ట్ర వాతావరణ విపత్తుల నియంత్రణ శాఖ రెడ్ అలెర్ట్‌ను ప్రకటించిందన్నారు. అత్యవసర సహాయ సమాచారం నిమిత్తం కలెక్టరేట్ కార్యాలయంలోని కంట్రోల్ రూంతో పాటు చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పం ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామన్నారు.

జిల్లా కలెక్టరేట్ కార్యాలయం
చిత్తూరు కంట్రోల్ రూమ్ : 08572-242777
ఆర్డీవో కార్యాలయం, చిత్తూరు : 6302905772
ఆర్డీవో కార్యాలయం, పలమనేరు: 9491074510
ఆర్డీవో కార్యాలయం, నగరి : 9491803680
ఆర్డీవో కార్యాలయం, కుప్పం : 9491074513, 6303024467

అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణలో 24/7 పనిచేసే టోల్ ఫ్రీ నెంబర్లు : 112, 1070, 1800 425 0101 లకు కాల్ చేయవచ్చని తెలిపారు.

అవస్థల నివాసం వసతి గృహం

- సమస్యలతో వసతి గృహ విద్యార్థులు సతమతం
- నిద్రావస్థలో అధికారులు

ఎంతో మంది నిరుపేదలు ఉన్నత ఆశయాలతో వసతి గృహాల్లో చేరి విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థుల బాగోగులు చూడాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో పేద విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. పిల్లలు పడుతున్న కష్టాలను చూసి తల్లిదండ్రులు వసతి గృహాల్లో చేర్పించేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. దీన్ని చూస్తున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడంతో విద్యార్థుల దీనావస్థ వర్ణనాతీతంగా మారింది.

ప్రజాశక్తి- పూతలపట్టు: దిగువ మధ్యతరగతికి చెందిన నిరుపేద కుటుంబాల ప్రజలు తమ పిల్లలు తమలాగా కష్టపడకూడదనే ఉద్దేశంతో వసతి గృహాల వైపు చూస్తున్నారు. పిల్లలు దూరంగా ఉన్న విద్యావంతులైతే తమ భవిష్యత్తు అన్ని విధాలుగా మెరుగుపడుతుందని ఆశతో వసతి గృహాల్లో చేర్పిస్తున్నారు. కానీ పేద విద్యార్థులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఆ వసతి గృహంలోని సమస్యలపై దృష్టి సారించక పోవడంతో పిల్లలకు ఇబ్బందులు తప్పడం లేదు. అరకొరా వసతులతో నానా అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. కొంతమంది విద్యార్థులు అయితే వసతి గృహాల్లో ఉండలేక ఇంటిదారి పడుతున్న సందర్భాలు ఉన్నాయి.

మరుగుదొడ్లు లేక అవస్థలు..

పూతలపట్టు మండలం పి కొత్తకోట ఎస్‌సి బాలురు వసతి గృహంలో 64 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి కేవలం నాలుగు మరుగుదొడ్లు ఉన్నా యి. ఈ క్రమంలో విద్యార్థులు మరుగుదొడ్ల కోసం పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని సందర్భాల్లో వి ద్యా ర్థు లు మరుగుదొడ్లు సరిపోక ఆరు బయటకు పరుగు లు తీయాల్సిన దుస్థితి నెలకొంది. ఇలాంటివి చిత్తూరు జిల్లాలో అనేకం వున్నా యి. ఇక్కడ సరైన గదులు లేక పోవడం తో విద్యార్థులు కనీసం కూర్చొని చదువుకోవడానికి కూడా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



పారిశుద్ధ్యం లోపించిన మరుగుదొడ్లు



చాలీచాలని గదులతో వరండాలో కూర్చొని చదువుతున్న విద్యార్థులు

జిల్లాలో పరిస్థితి ఇదీ

చిత్తూరు జిల్లాలో 57 ఎస్‌సి బాలుర వసతి గృహాలు ఉండగా.. 35 బీసీ హాస్టళ్లు ఉన్నాయి. మరో నాలుగు గురుకుల పాఠశాలల్లోని ఎస్టీ వసతి గృహాలు ఉన్నాయి. 92 వసతి గృహాల్లో 20 వసతి గృహాలు మినహాయిస్తే మిగిలిన అన్నిచోట్ల విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. కొన్నిచోట్ల భవనాల పెచ్చులూడి విద్యార్థులపై పడుతున్నాయి. మరి కొన్నిచోట్ల తినడానికి సరైన వసతులు లేక చెట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి. ప్రస్తుతం శీతాకాలం కావడంతో సరైన కిటికీలు తలుపులు లేకుండా విద్యార్థులు చలితో వణకాల్సి వస్తోంది. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.



చిత్తూరు జిల్లా వీవోఏ సంఘమిత్రల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: చిత్తూరు జిల్లా వీవోఏ సంఘ మిత్రల నూతన కమి టీని ఎన్ను కున్నారు. చిత్తూరు జిల్లా వీవోఏ సంఘమిత్రల మూడవ మహాసభ కాణిపాకంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు, సీఐటీయూ అధ్యక్షులు గిరిధర్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహాసభలో జిల్లా స్థాయి కొత్త కమిటీని ఎన్నుకున్నారు. చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా పి నాగరాజు (బైరెడ్డిపల్లి), ప్రధాన కార్యదర్శిగా కె శ్రీధర్ బాబు (ఎస్ఆర్‌పురం), కోశాధికారిగా జగదాంబ (తవనంపల్లి)ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జిను రాజశేఖర్ (ఐరాల), చంద్రబాబు (పలమనేరు), ఉమామహేశ్వరిలను ఎన్నుకున్నారు. జిల్లాలోని 31 మండలాల నుండి హాజరైన 1,260 మంది సంఘమిత్రల సమక్షంలో వివిధ బాధ్యతలు అప్పగించారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వివోఏలకి కనీస వేతనం అమలు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ పది లక్షలు అమలు చేయాలని, మణిపాకం తగ్గించి కొత్త ఫోన్లు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు మానుకోవాలని, అధికారుల వేధింపులు మానుకోవాలని పలు రకాల తీర్మానాలు చేశారు.



నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

15 ఎకరాల్లో వరికి నష్టం

ప్రజాశక్తి -యాదమరి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా యాదమరి మండలంలో ఇప్పటివరకు 14.71 ఎకరాల్లో వరి పంటకు, 1 ఎకరంలో వేరుశనగ పంటకు నష్టం జరిగినట్లు గుర్తించామని మండల వ్యవసాయ అధికారి దీపా తెలిపారు. మండలంలోని పెరుమాలపల్లి గ్రామానికి చెందిన నోమేశ్వర్ రెడ్డి వరి పొలాన్ని జిల్లా ఏరువాక సాంకేతిక కేంద్రం (డిటిడిసి), చిత్తూరు కోఆర్డినేటర్ డా. ఏ. రామకృష్ణారావు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ ఏ ఆర్ ఎస్), తిరుపతి శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారి సి. హెచ్. దీప, రైతు సేవా సహాయకులు వై హేమ సోమవారం పరిశీలించారు. వరి పంటల్లో గమనించిన సమస్యలపై తగిన సాంకేతిక సూచనలు, నివారణ చర్యలు రైతులకు వివరించారు.



రెండవ రోజుకు ఓపెన్ హౌస్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా ప్రతీ ఏటా అమరవీరులైన పోలీసులను స్మరించుకుంటూ నిర్వహించే ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని 2వ రోజు నిర్వహించారు. జిల్లా ఏఆర్ పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో జిల్లా పోలీసులు వినియోగించే ఆయుధాలు, పరికరాలు, సాధనాలను ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా ప్రదర్శనలో ఉంచారు. పోలీసు అమరవీరుల వారోత్స వాలలో భాగంగా ఈ కార్యక్రమం ఈరోజుతో ముగిసింది. పోలీసు వ్యవస్థ పనితీరు గురించి, పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాలు, సాధనాల గురించి కళాశాల, పాఠశాల విద్యార్థిని విద్యార్తులు తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆయుధాల గురించి ఎఆర్ సిబ్బంది అవగాహన చేశారు. ఎలాంటి సందర్భంలో ఎలాంటి ఆయుధాన్ని వినియోగిస్తారు, వాటి పని తీరు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణములోని స్కూల్స్, కాలేజీ విద్యార్థులు సుమారు 1000 మంది పాల్గొన్నారు. ఈ ఓపెన్ హౌస్ కి రావడం వల్ల పోలీసుల గురించి ఎంతో తెలుసుకున్నామని ఎంతో స్ఫూర్తి దాయకంగా పోలీసులున్నారని విద్యార్థులు తెలిపారు.

మునిగిన దోబీఘాట్

- వినతులు పట్టని పాలకులు
- అందని సబ్సిడీ రుణాలు
- అటకెక్కిన ఆదరణ పనిముట్లు
- ఆవేదనలో రజకులు

ప్రజాశక్తి -వి కోట : మాసిన దుస్తులపై మురికిని తొలగించి దుస్తులకు నూతనత్వాన్ని అందించే రజకుల బతుకులు మాత్రం మసిబారుతున్నాయి. జీవనాధారమైన దోబీ ఘాట్ వర్షానికి మునిగిపోవడంతో దిక్కుతోచని స్థితిలో రజకుల బతుకులు అయోమయంగా మారాయి.

వినతులు పట్టని పాలకులు

మండల కేంద్రమైన వి కోట గంగాభవాని రజక సంఘం అభ్యర్థన మేరకు కీలపల్లి చెరువులో 2002 సంవత్సరంలో దోబీ ఘాట్ ను ప్రభుత్వం నిర్మించింది. అనంతరం 2025లో దోబీ ఘాటుకు అనుసంధానంగా షెడ్లు నిర్మించారు. దోబీ ఘాటు కు అనుసంధానంగా ఒక బావిని కేటాయించ డంతో అందులోని నీటినే దోబీ ఘాట్‌లో రజకులు ఉపయోగించు కునేవారు. వేసవిలో బావి ఎండిపోవడంతో బోరు కోసం సంఘం తరపున పాలకులకు పలుమార్లు మొం పెట్టుకున్నా ఇప్పటికీ వారి వినతిని ఆలకించలేదని ఆ సంఘ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోబీ ఘాట్ నిర్మించి 23 సంవత్సరాలు పైగా కావ డంతో ఘాట్, షెడ్లు శిథిలా వస్థకు చేరుకున్నా యి. వాటికి మరమ్మతులు చేయాలని కలెక్టర్ కు, స్థానిక ప్రజాప్రతి నిధులకు, రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతులు సమర్పించినా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు.



మునిగిన దోబీఘాట్

మునిగిన దోబీఘాట్

ఇటీవల కురిసిన వర్షాలకు తోడు హంద్రీ–నీవా కాలువ ద్వారా కీలపల్లి పెద్ద చెరువుకు భారీగా నీరు చేరడంతో చెరువు నిండుకుండలా మారింది. దీంతో చెరువులో నిర్మించిన దోబీఘాట్ నీట మునిగింది. షెడ్లు ఇతర నిర్మాణాలలో పూర్తిగా నీరు చేరడంతో పాటు బావి కూడా మునిగి పోయింది. గతంలో రజకుల సమస్యలు పరిష్కరించాలని దోబీ ఘాట్ పరిధి పెంచి శాశ్వత భవనాలు నిర్మించాలని సంఘం తరపున జిల్లా ఉన్నతాధికారులకు వినతలు అందించారు. అవి ఇప్పటికీ పరిష్కా రానికి నోచుకోలేదని ఆ సంఘ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నమ్ముకున్న రజకులకు ఉపాధి కరు వైందని ప్రభుత్వం వెంటనే తమ సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.



మాట్లాడుతున్న గంగాభవాని రజక సంఘం అధ్యక్ష కార్యదర్శులు

అందని సబ్సిడీ రుణాలు

తమకు ఏవైనా దుస్తుల ఇస్త్రీ దుకాణం ఏర్పాటుకు, ఇస్త్రీ పెట్టెల కొనుగోలుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సబ్సిడీ రుణాలు అందడంలేదని రజక సంఘం సభ్యులు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

అటకెక్కిన ఆదరణ పనిముట్లు

గతంలో తమకు ఆదరణ పథకం కింద పనిముట్లు ఇప్పించాలని రజక సంఘం సభ్యులు కోరుతున్నారు. గతంలో తమకు అవసరమైన పరికరాలను ఆదరణ పథకం కింద ఇచ్చి ఆదుకునేవారని వాపోయారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు పనిముట్లు ఇప్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.


ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు మరిచారు..

- తప్పని తాగునీటి కష్టాలు
- కనమనపల్లి ప్రజల ఆవేదన
- రెస్కో డైరెక్టర్‌కు తెలిపినా పట్టించుకోని వైనం
- ముఖ్యమంత్రి నియోజకవర్గంలో దుస్థితి

ప్రజాశక్తి-గుడిపల్లి: గుడుపల్లి మండలం కనమనపల్లి గ్రామ పంచాయతీ, కనమనపల్లిలో తాగునీటికి మూడు రోజుల నుండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయలేదని, సంబంధిత రెస్కో డైరెక్టరుకు తెలిపినా స్పందించలేదని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు మరిచారు

గుడుపల్లి మండలం కనమనపల్లి గ్రామ పంచాయతీ, కనమనపల్లిలో మూడు రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. ఎవరూ పట్టించుకోక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు బీసీ కాలనీలోని 120 కుటుంబాలు వున్నాయి. మూడు రోజుల నుండి ట్రాన్స్ ఫార్మర్‌కు మరమ్మతులు చేయకపోవడంతో తాగునీటి సమస్యతో వ్యవసాయ బోరు నుండి నీటిని తీసుకోచ్చి కుటుంబ అవసరాలకు, పశువులను కాపాడుకుంటున్నామని తెలిపారు.



మూడు రోజులుగా మరమ్మతులకు నోచుకోని ట్రాన్స్‌ఫార్మర్

రెస్కో డైరెక్టర్‌కు తెలిపినా పట్టించుకోని వైనం

ఈ విషయం రెస్కో అధికారులకు, నాయకులకు తెలిపినా తమ గోడు పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కుప్పంలోని గుడిపల్లి మండలంలో ఈ దుస్థితి నెలకొనడం దారుణమని వారు తెలిపారు. అదే గ్రామంలో రెస్కో డైరెక్టర్ ఉన్నా ట్రాన్స్‌ఫార్మర్ రిపేరుకు నోచుకోలేదన్నారు. ఈ విషయమై ఆయనను వివరణ కోరగా తనకు ఇప్పటివరకు సమాచారం అందలేదని చెప్పడం విడ్డూరంగా వుందన్నారు.

కనమనపల్లి ప్రజల ఆవేదన

తాగునీటికి ఇబ్బంది లేకుండా పుష్కలంగా నీరు ఉన్నా ఇలాంటి సమస్యలకు పరిష్కారం చూపకపోవడం దారుణమని ఆ గ్రామస్తులు వాపోతు న్నారు. ఈ విషయమై సర్పంచిని వివరణ కోరగా... తాగునీటికి ఎలాంటి సమస్య లేదని, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవడంతో ఈ సమస్య తలెత్తిందని ఈ విషయమై రేస్కోవారికి సమాచారం అందించానని ఆయన తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు స్టాక్ లేదని తెలిపారని ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రి నియోజకవర్గంలో దుస్థితి

ఇప్పటికైనా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చూసే బాధ్యత అధికారులపై, రెస్కో సిబ్బందిపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. కోట్లు ఖర్చు చేసి కుప్పం నియోజకవర్గానికి తాగు, సాగు నీటికి హంద్రీ–నీవా కాలువ ద్వారా అందిస్తున్న ఇలాంటి నియోజక వర్గంలో ఇలాంటి దుస్థితి ఏర్పడడం దారుణ మన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.



చెరువును పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి గిరీషా

మొరవ కాలువను పటిష్టం చేయాలి

పంచాయతీరాజ్ ఇంజినీర్లకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్, జిడి నెల్లూరు: మొరవ కాలువను పటిష్టం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి కలెక్టర్ సుమిత్ కుమార్ పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. సోమవారం తుపాను ప్రభావం తో కురిసిన భారీ వర్షాల కారణంగా జీడి నెల్లూరు మండలంలో సుమారు 26 చెరువులు పూర్తిగా నిండాయి. అందులో భాగంగా మొంథా తుపాను జిల్లా ప్రత్యేక అధికారి గిరీషా, కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పి తుషార్ డూడీ, ఆత్మకూరు చెరువు మొరవను పరిశీలించారు. మొరవ కాలువను పటిష్ట పరచి ఎంత నిధులు అవసరమో సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. సుమారు 20 లక్షల నుండి 25 లక్షల వరకు నిధులు అవసరమని ఇంజనీర్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ చెరువు ద్వారా సుమారు 300 ఎకరాల రైతులకు సాగునీరు అందుతుందని, ఎల్లాపల్లి చెరువు, వంక, నీవా కాలువ ఈ చెరువు సమీపంలో ఉన్నాయని సంబంధిత అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ డి ఈ ఆనంద రెడ్డి, ఏఈ సుగుణాకర్ రావు, తహశీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో మనోహర్ గౌడ్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

తీర్పు 30కి వాయిదా

మేయర్ హత్య కేసు నిందితులకు రిమాండ్



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌ల హత్య కేసులో నిందితులకు 27వ తేదీ శిక్షను ఖరారు చేయాల్సిన కోర్టు తీర్పును ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసింది. 2015 నవంబర్ 17వ తేది నరగ మేయర్ కఠారి అనురాధ, కఠారి మోహన్‌ల జంటహత్య కేసులో జిల్లా కోర్టు ఏ 1 నుండి ఏ5 వరకు ఛార్జిషీట్‌లో ఉన్న వారిని ఈ కేసులో ముద్దాయిలుగా తేల్చింది. ఈ మేరకు సోమవారం తుది తీర్పు వెల్లడించనున్నట్లు తొమ్మిదవ అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు ప్రకటించారు. సోమవారం ఐదుగురు నిందితులను తొమ్మిదో అదనపు న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుండి 12.45 గంటల వరకు నిందితుల వాదనలు న్యాయమూర్తి విన్నారు. ఈ సందర్భంగా హత్య చేయడానికి గల కారణాలపై 20 ప్రశ్నలు న్యాయమూర్తి నిందితులను ప్రశ్నించారు. ముద్దాయిల జైల్ అధికారి, వైద్యుల నివేదికలను సమర్పించాలని పోలీసులను న్యాయమూర్తి ఆదేశించారు. వాదోపవాదనలు విన్న తరువాత జంట హత్య కేసులో నేర నిరూపణ అయిన ఏ 1 చింటూ అలియాస్ చంద్రశేఖర్, వెంకటాచలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేష్ లపై శిక్ష ఖరారును ఈనెల 30వ తేదీకి వాయిదా వేస్తూ 30వ తేది వరకు రిమాండ్ విధించారు. పోలీసులు భద్రత నడుమ నిందితులను చిత్తూరు సబ్‌జైల్‌కు తరలించారు.

వెట్టి చాకిరీ నుండి విముక్తి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: రెవెన్యూ డివిజనల్ అధికారి చిత్తూరు వారి ఆదేశాలు మేరకు గంగాధర నెల్లూరు తహశీల్దారు శ్రీనివాసులు, పోలీసులు వీఆర్వో జయరాజ్, స్వచ్ఛంద సంస్థ జీవనజ్వాల ప్రతినిధులు వెట్టిచాకీరిపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం విచారణలో బుక్కపట్నం గ్రామం గుట్ట వద్ద పుష్పరాజ్ అను ఇటుకల వ్యాపారి తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా, ఉత్తంగారై తాలూకా ఒబాగవలస గ్రామానికి చెందిన మణి, భార్య, నలుగురు పిల్లలను ఇటుకల బట్టి లో పనిచేసేందుకు 20 వేల రూపాయలు అడ్వాన్స్ ఇచ్చి తెచ్చుకున్నారు. వారిని ఇంటికి పంపకుండా అక్కడే గుట్టలో షెడ్డులో పెట్టి పని చేయించుకుని, సక్రమంగా కూలి డబ్బు చెల్లించకుండా నిర్బంధించి వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు వారిని వెట్టి చాకిరీ నుండి విముక్తి చేసి వారిని స్వగ్రామాలకు పంపించారు.

అప్రమత్తంగా ఉండాలి: తహశీల్దారు



ప్రజాశక్తి -యాదమరి: మండలంలో సగానికి పైగా చెరువులు పూర్తి స్థాయిలో నిండి ఉండడంతో గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు పార్థసారధి కోరారు. కలెక్టర్ ఆదేశానుసారం మంగళ, బుధవారం వారి కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం తహశీల్దారు మాట్లాడుతూ నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు దాదాపుగా నిండాయని,వాటి సమీప ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక తహశీల్దార్ పార్ధసారధి అన్నారు. సోమవారం ఆయన స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎంపిడిఓ వీరేంద్రతో కలిసి మొంతా తుపానుపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాలకు మండలంలోని 59 చెరువులకు 27 చెరువుల్లో నిండాయన్నారు. రాష్ట్రంలో తుపాను బీభత్సంగా వుండడంతో మండలం లో దాని ప్రభావం అంతగా ఉండకపోవచ్చని , ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. అయితే రెండు రోజులు పాటు తుపాను ప్రభావం ఉన్న నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేశామన్నారు .క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని రెవెన్యూ ,సచివాలయం సిబ్బందికి ఆదేశించామని అన్నారు. నీటి ప్రవాహం అధికంగా ప్రదేశాలలో హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేశామని..అక్కడ పోలీసు సిబ్బందిని 24 గంటలూ పర్యవేక్షించే లా చర్యలు తీసుకున్నామని చెప్పారు.ప్రతీ సచి వాలయంలో మినీ జనరేటర్లు ను సిద్ధం చేశామన్నారు. చెరువులు,వాగుల వద్దకు చిన్న పిల్లలను పంపించకుండా తల్లిదండ్రులు జాగురకతతో వ్యవహరించాలని సూచించారు. గ్రామాల్లో తాగు నీటి కి సమస్య రాకుండా పంచాయతీ కార్యదర్శులకు మార్గదర్శకాలను జారీ చేశామని ఎంపిడిఓ వీరేంద్ర చెప్పారు. ఈ సమావేశంలో ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ ఉషారాణి పాల్గొన్నారు.

విజయపురం (నగరి): మొంథా తుపాను కారణంగా భారీ వర్షం కురిసే ప్రమాదం వుందని ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఆర్‌డివో అనుపమ, తహశీల్దారు రవికుమార్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. తుపాను కారణంగా నగరి పరిసర ప్రాంతాల్లో ఆర్డీవో అనుపమ, తహశీల్దారు రవికుమార్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ముంపు ప్రాంతాలు చింతలపట్టెడ దళిత వాడ, లింగోసుగుంట, నగరిపేట లో సోమవారం పర్యటించారు. అక్కడి నివాసితులను అప్రమత్తం చేశారు. వర్షం తాకిడి ఎక్కువగా ఉంటే సమీప పాఠశాలకు వెళ్లాలని సూచించారు. పెద్దలు, పిల్లలు చెరువులు వాగులు, కుంటలతో పాటు నీటి ప్రవాహమున్న ప్రాంతాలకు వెళ్లకూడదని హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలోని 17 సచివాలయాల్లోను ప్రత్యేక సహాయక కేంద్రంను ఏర్పాటు చేశా మన్నారు. ప్రజలు హెల్ప్‌లైన్ నెంబరు: 9949563111, 7330299301, 9884288313లకు ఫిర్యాదులు చేయవచ్చాన్నారు.



వైసిపి వాణిజ్య విభాగం మండల అధ్యక్షుడిగా డికె సురేంద్రరెడ్డి



ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు గంగాధర నెల్లూరు మండల వైసిపి అనుబంధ విభాగాల నియామకలలో భాగంగా వాణిజ్య విభాగం మండల అధ్యక్షుడి గా డీకే సురేంద్రరెడ్డిని నియమించారు. తాడేపల్లి లోని కేంద్ర పార్టీ కార్యాలయంలో శనివారం జారీ చేసిన నియామకాల ప్రక్రియలో భాగంగా జిడి నెల్లూరు మాజీ జెడ్పిటిసి కృష్ణారెడ్డి తనయులు డీకే సురేంద్రరెడ్డిని మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీకే సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ వైసిపి అభివృద్ధి కోసం రానున్న కాలంలో మరింత రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తానని తెలిపారు. తనకు అవకాశం కల్పించిన జిల్లా పార్టీ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నియోజకవర్గ సమన్వయకర్త కృపా లక్ష్మికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి కమిటీ సమావేశాలు

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం మండలం చెక్కు నత్తం, టి సదమూరు, మల్లనూరు గ్రామపంచాయతీ సమన్వయ కమిటీ సమావేశం సోమవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాజగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. గ్రామీణ స్థాయిలో పార్టీ క్యాడర్ ను మరింత బలోపేతం చేయడంతో పాటు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ క్యాడర్ ను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా సమన్వయ కమిటీ లో చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని రాజగోపాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడా అడ్వైజర్ కమిటీ సభ్యులు రామచంద్రన్, మాజీ ఎంపీపీ సాంబశివన్, ఏపీఎస్‌డిడబ్ల్యు డైరెక్టర్ శరవణ , కో క్లస్టర్ ఇన్‌చార్జ్ విభూషణ్ , ఆ పార్టీ ప్రెసిడెంట్ మనోహర్, చంద్ర యూనిటీ ఇన్‌చార్జ్ లు మోహన్, కో యూనిట్ ఇన్‌చార్జ్ తిరుపతి, ఆ పార్టీ ప్రెసిడెంట్ రమేష్, యూనిట్ ఇన్‌చార్జ్ దాము, నియోజకవర్గ యువత వన్యకుల క్షత్రియ అధ్యక్షుడు సతీష్, నాయకులు పాల్గొన్నారు.

రెయిన్ కోట్లు పంపిణీ



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : నగరపాలక పారిశుధ్య కార్మికు లకు రెయిన్ కోట్లను సోమవారం పంపిణీ చేశారు. కమిషనర్ పి నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు వర్షాల నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం లేకుండా విధులు నిర్వహించడానికి వీలుగా నగరపాలక పరిధిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 500 పారిశుధ్య కార్మికులకు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం సభ్యులకు రెయిన్ కోట్లను ఎంహెచ్‌వో డాక్టరు పి. లోకేష్ పంపిణీ చేశారు. సోమవారం ఉదయం నగర పరిధిలోని మస్టర్ పాయింట్లో వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు, మేస్త్రీలు కార్మికులకు రెయిన్ కోట్లను అందించారు.

వరి రైతులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: వరి రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త రామకృష్ణారావు అన్నారు. సోమవారం మండలంలోని మహాసముద్రం టేకుమంద చీకురుపల్లి గొల్లపల్లి వెలుతురు చేను గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వరి పొలాలు పంట కోతకు సిద్ధంగా ఉన్నాయి. వరి పొలం కోతకు సిద్ధంగా ఉన్న 5 గ్రామాలలో 12 ఎకరాల లో ఇటీవల కురిసిన వర్షాలకు వరి కంకులు పడిపోయి మొలకలు వచ్చి నష్టం జరిగినట్లు గుర్తించామని అధిక వర్షాలకు వరి పంట నష్టపోకుండా తగు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు డాక్టరు సరళ, డాక్టరు వజంత, డాక్టరు నాగమణి, డాక్టర్ హారతి, మండల వ్యవసాయ అధికారి భారతి పలువురు రైతులు పాల్గొన్నారు.



అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: మండల కేంద్రం లోని సింగిల్ విండో కార్యాలయంలో సంఘ సభ్యు లతో అవగాహన సద స్సు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి సీఈఓ కేసి జ్యోతి రామ్, సూపరు వైజర్ విజయభాస్కర్, పిఎసిఎస్ అధికారులు, మండలంలోని రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఈఓ జ్యోతి రామ్ మాట్లాడుతూ రైతులు సహాయక సంఘం ద్వారా ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేస్తున్నామని, వ్యవసాయ అవసరాల నిమిత్తం రైతులు సింగల్ విండో కార్యాలయాన్ని సంప్రదిస్తే అన్ని విధాల సహకారం అందిస్తామని తెలిపారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల వివరాలు తెలుసుకొని వాటి ద్వారా ప్రయోజనం పొందాలని ఆయన కోరారు.

ఆర్‌టిసి బస్టాండు పరిశీలన

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణం ఆర్టీసీ డిఎం అల్తాఫ్ బస్టాండును సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం రోజు కురిసిన భారీ వర్షానికి బస్టాండ్ ఆవరణ వర్షపు నీరుతో నిండిపోయింది. దానికి నష్ట నివారణ చర్యలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బస్టాండుకు ఇరువైపులా ఉన్న రాజు కాలువలలో వ్యర్థాల వల్ల నీరు సరిగా పోకుండా బస్టాండ్, లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు, డ్రైనేజీ వాటర్ చేరుకుంది. మరోసారి అలాంటి ఘటనలకు తావు లేకుండా మున్సిపల్ అధికారులతో కోఆర్డినేషన్ చేసుకొని ఆర్టీసీ బస్సు ప్రాంగణం, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం రాజు కాలువలను పరిశీలించారు. దుకాణాల మధ్య కాలీ ప్రదేశాలలో చెత్త ఎక్కువగా ఉండటం వల్ల ఆ ప్రదేశాలను క్లీన్ చేయించారన్నారు. తదుపరి బస్సు ప్రయాణికులను కలిసి వచ్చిపోయే సర్వీసులలో ఏవైనా ఇబ్బందులు ఉంటే తెలపాలని కోరి వారి సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రానున్న తుపాను నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం అల్తాఫ్, ఏడిఎం లక్ష్మీనారాయణ, ఆర్టీసీ సిబ్బంది రాజా పాల్గొన్నారు.



బాధితురాలికి సాయం అందిస్తున్న టిడిపి నాయకులు

బాధితురాలికి సాయం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరపాలక పరిధిలో 28వ వార్డు వినాయకపురంలో వృద్ధురాలుకు చెందిన పూరి గుడిసె వర్షానికి గోడ కూలి పోయింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోడ పూర్తిగా తడిసి పోవడంతో ఆదివారం రాత్రి పడిపోయింది. ఇంట్లో వస్తువులు నీట మునిగాయి. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ఆదేశాల మేరకు.. ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది, స్థానిక టిడిపి నాయకులు వృద్ధురాలు నివాసాన్ని పరిశీలించారు. ఇల్లు కూలిపోవడంపై ప్రభుత్వానికి నివేదిస్తామని, ప్రభుత్వం తరపున ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. తక్షణ సాయంగా ఒక బస్తా బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో స్థానిక వార్డు టిడిపి అధ్యక్షుడు నిరంజన్ బాబు, నాయకులు దయాలు, రామ, శక్తి కుమార్, బూత్ కన్వీనర్ పుష్ప పాల్గొన్నారు.



వెంకట్రామయ్యకు నివాళి

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లి పంచాయతీ చింతలగుంట గ్రామానికి చెందిన టిడిపి బూత్ కన్వీనర్ ఇ కుమార్ తండ్రి వెంకట్రామయ్య ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృత దేహానికి సోమవారం పూలమాలలు వేసి తెలుగు తమ్ముళ్ల నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వెదురుకుప్పం మండల టిడిపి ఇన్‌చార్జి మోహన్ మురళి, మునిచంద్ర రెడ్డి, నరసింహ యాదవ్, వరప్రసాద్, బీఎం రవి, చొక్కా మహేష్, మొగిలయ్య, బాబునాయుడు, డి బాబునాయుడు రాజగోపాల్, హేమశేఖర్, భాస్కరరెడ్డి, బాలకృష్ణ, జగద పాల్గొన్నారు.



దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -వి కోట : మండల పరిధిలోని చింతమాకులపల్లి గ్రామ సచివాలయంలో పశుసంవర్ధక శాఖ సహాయకులుగా విధులు నిర్వహించే బాలకృష్ణ ఆదివారం హఠాత్మరణం చెందడంతో వారి దహన సంస్కారాలకు మండల పరిషత్ కార్యాలయం ద్వారా మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. చింతమాకులపల్లి గ్రామ సచి వాలయంలో ప్రస్తుత సహాయకులుగా బాలకృష్ణ విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం తన కుటుంబ సభ్యులతో కలసి బైరెడ్డిపల్లి బంధువుల ఇంటికి వెళ్తున్న సమయంలో అనారోగ్య కారణంతో ఆకస్మాత్తుగా కుప్పకూరడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న వి కోట ఎంపీపీ యువరాజ్ ఆదేశాల మేరకు ప్రభుత్వం నుండి అందాల్సిన దహన సంస్కార ఖర్చులకు ఆర్థిక సాయాన్ని మండల పరిషత్ సిబ్బంది సోమవారం మృతుని కుటుంబ సభ్యులు అందించారు.



మునెమ్మకు నివాళులు అర్పిస్తున్న ఎంపిపి

మునెమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలంలోని వెంగంవారిపల్లి గ్రామానికి చెందిన మురళి తల్లి మునెమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక సర్పంచ్ రవిచంద్రబాబు ద్వారా విషయం తెలుసుకున్న బైరెడ్డిపల్లి మండల ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, వెంటనే స్పందించి వెంగంవారిపల్లి గ్రామానికి చేరుకుని సర్పంచ్, వార్డు మెంబరు, వైసిపి నాయకులు, కార్యకర్తలు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మునెమ్మ మృతికి గ్రామ ప్రజలు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - ఎస్‌ఆర్ పురం : గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ వి ఎం థామస్ మంగళవారం మండలంలోని తయ్యూరు, జిఎంఆర్ పురం గ్రామాల్లో పర్యటించ నున్నట్లు వ్యక్తిగత కార్యదర్శి అనిల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల టిడిపి నాయకులు కూటమి నాయకులు కార్యకర్తలు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి: కమిషనర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్ : మొంథా తుపాను ప్రభావంతో ఆకస్మిక, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని కమిషనర్ పి నరసింహ ప్రసాద్ చెప్పారు. వర్షాలపై సోమవారం సాయంత్రం టెలి కాన్ఫరెన్స్ ద్వారా హెచ్వోడీలు, వార్డు కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. తుపాను ప్రభావంతో సోమవారం రాత్రి, మంగళవారం ఆకస్మిక వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే చెరువులు నీటితో నిండి, వాగులు ప్రవహిస్తున్న దృష్ట్యా క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా నీవా నది పరివాహక ప్రాంతాల వార్డుల్లో నిర్దేశించిన అధికారులు, కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని ప్రజలకు అందించాలన్నారు. సంతపేట, ఇతర లోతట్టు ప్రాంతాల పరిధిలోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కాలువల్లో నీటిమట్టం పెరిగితే వేగంగా చర్యలు తీసుకునేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం, జేసీబీలు, ఇతర పనిముట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విపత్తుల సమయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎంహెచ్వో డా లోకేష్, ఎసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి మరో దారి ఏర్పాటు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి ప్రస్తుతం ఉన్న మార్గంతో పాటు, రెండవ దారి ఏర్పాటుపై అధికారులు పరిశీలన చేపట్టారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆదేశాల మేరకు అపోలో యాజమాన్యం, కమిటీ సభ్యులు, నగరపాలక అధికారులు సంయుక్తంగా సోమవారం మధ్యాహ్నం రెండవ దారి ఏర్పాటుపై పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడానికి గతంలో రెండు దారులు ఉండగా.. కాలక్రమంలో ఒక దారి అన్యాక్రాంతం అయింది. ప్రస్తుతం చర్చి వీధి మీదుగా ఒకే దారి ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితుల్లో గంగనపల్లి చింతమాను సర్కిల్ నుంచి ఆసుపత్రికి రెండవ దారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కమిషనర్ పి నరసింహ ప్రసాద్, అపోలో ఆస్పత్రి సీఓఓ నరేష్ రెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, పీఏ కుమార స్వామి యాదవ్, ఆసుపత్రి అధికారులు, సభ్యులు జి.సురేష్, అరుణ, నగర టిడిపి అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి పచ్చప్ప, కార్పొరేటర్ శశి, వరదరాజులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అపోలో కళాశాలలో ఆంటీ డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహణపై చర్చించారు.

2వ రోజుకు ఓపెన్ హౌస్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా ప్రతీ ఏటా అమరవీరులైన పోలీసులను స్మరించుకుంటూ నిర్వహించే ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని 2వ రోజు నిర్వహించారు. జిల్లా ఏఆర్ పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో జిల్లా పోలీసులు వినియోగించే ఆయుధాలు, పరికరాలు, సాధనాలను ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా ప్రదర్శనలో ఉంచారు. పోలీసు అమరవీరుల వారోత్స వాలలో భాగంగా ఈ కార్యక్రమం ఈరోజుతో ముగిసింది. పోలీసు వ్యవస్థ పనితీరు గురించి, పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాలు, సాధనాల గురించి కళాశాల, పాఠశాల విద్యార్థిని విద్యార్తులు తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆయుధాల గురించి ఎఆర్ సిబ్బంది అవగాహన చేశారు. ఎలాంటి సందర్భంలో ఎలాంటి ఆయుధాన్ని వినియోగిస్తారు, వాటి పని తీరు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణములోని స్కూల్స్, కాలేజీ విద్యార్థులు సుమారు 1000 మంది పాల్గొన్నారు. ఈ ఓపెన్ హౌస్ కి రావడం వల్ల పోలీసుల గురించి ఎంతో తెలుసుకున్నామని ఎంతో స్ఫూర్తి దాయకంగా పోలీసులున్నారని విద్యార్థులు తెలిపారు.

ప్రమాదకరంగా చెరువు కట్ట

- గురునాథం చెరువుపై పొంగిన నీరు
- మట్టి నింపిన అధికారులు



ప్రజాశక్తి-సోమల: సోమల మండలం ఆవుల పల్లె గ్రామానికి ఆనుకుని ఉన్న నంజంపేట పెద్ద ఉప్పరపల్లి ప్రధాన రహదారికి సంబంధించిన గురునాథం చెరువు పూర్తి స్థాయిలో నిండి చెరువు నీరు కట్టపై గండిపడి ప్రమాద కర పరిస్థితులలో ఉండడంతో తహశీల్దారు మధుసూదన్ విఆర్ఓ లు సంఘటన స్థలానికి వెళ్లి కట్ట కొట్టుకుపోకుండా ట్రాక్టర్లతో మట్టి తోలిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ముంథా తుపాను ప్రభావంతో వర్షాలు విస్తారంగా పడి మళ్లీ కట్ట పైనుండి నీళ్లు పొంగిపొరలితే కట్టకు ప్రమాదం జరిగే పరిస్థితి ఉందని ఈ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కట్ట పూర్తిగా తెగిపోతే రాకపోకలు నిలిచిపోతాయని మూడు పంచాయతీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎంపీడీవో ప్రసాద్ శనివారం జీడి రేవుల వంక చెన్నపట్నం చెరువు పరిశీలించి కార్యదర్శులకు విఆర్ఓలకు పోలీసులకు పలు సూచనలు ఇచ్చి ప్రజలు ఎవరు ప్రమాదకరంగా వంకలు దాటకుండా బందోబస్తు నిర్వహించాలని మొరవ ప్రాంతానికి ఎవరు వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో తహశీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అత్యవసర పరిస్థితి ఏదైనా ఉంటే కంట్రోల్ రూమ్ సిబ్బందికి తెలపాలని ప్రజలకు సూచించారు.

సీనియర్ ఆసిస్టెంట్‌గా నాగరాజ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: పలమనేరు ఎంపీడీఓ కార్యాలయంలో టైపిస్టు గా నాగరాజ పనిచేస్తూ సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతిపై మండల ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం విధుల్లో చేరినట్లు ఎంపీడీఓ బాలాజీ తెలిపారు.ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగోన్నతి పొంది విధులలో చేరిన నాగరాజు ను ఎంపీడీవో బాలాజీ, డిప్యూటీ ఎంపీడీవో శారదా దేవి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఓ గోపాల్ రెడ్డి, ఉపాధి హామీ ఏపిఓ మురుగేష్, కార్యాలయ పరిపాలన అధికారి సురేంద్ర, సిబ్బంది లలిత, అర్షియ పంచాయతీ కార్యదర్శులు రాజేష్, లత, బాలాజీ, సుజాత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ కాలువ పరిశీలన

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు సూపర్ బజార్ ముంపునకు కారణమైన రాజకాలువను మున్సిపల్ కమిషనర్ రమణరెడ్డి సోమవారం పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో రాజు కాలవపై మున్సిపల్ గదుల నిర్మాణంతో కాలువ మూసుకుపోవడంతో రాజు కాలువ సైజును కుదించడం రాజు కాలువ దిశను మార్చడమే కారణమని పలువురు విమర్శించడం, అందువల్ల నీరు బయటకు వెళ్లే దారిలేక సూపర్ బజార్, బస్టాండ్లోకి నీరు చేరిన సంగతి తెలిసిందే. స్పందించిన కమిషనర్ వెంటనే కాలువ మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టారు. కాలువపై ఉన్న బండలు తొలగించి కాలువ లోతు పెంచి గతంలో వలే యథాతథంగా నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ముందు జాగ్రత్తలు అవసరం: తహశీల్దారు

ఎస్‌ఆర్ పురం : వర్షాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో సీజన్ వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాలని ఆరుమాకుల వైద్యాధికారి డాక్టర్ బాలాజీ చరణ్ సచివాలయ ఆరోగ్య సిబ్బందికి ఏఎన్ఎం లకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే మూడు రోజుల్లో తుపాన్ ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, అందరూ అప్రమత్తంగా, అత్యంత జాగ్రత్తగా ఉండాలని గ్రామాల్లో ఆశా కార్యకర్తల ద్వారా తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఏనుగుల దాడుల నుండి రక్షణ కల్పించండి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ఏనుగుల బారినుండి రైతులకు పూర్తి రక్షణ కల్పించాలని చిత్తూరు జిల్లా అటవీ శాఖ అధికారి కి సోమవారం .రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఉమాపతి నాయుడు డీఎఫ్ఓకు వినతి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏనుగుల దాడుల నుండి పంటలతోపాటు రైతులకు పూర్తి రక్షణ కల్పించి గజ దాడులను అరికట్టేందుకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని సూ చిం చా రు. చిత్తూరు సుమారు 3 లక్ష లా 40 వేలపైన రైతు కుటుంబాలు పూర్తిగా వ్యవసాయాన్ని నమ్ముకుని కాయకష్టంతో శ్రమజీవులై జీవిస్తున్నారని ఈ నేపథ్యంలో కొన్ని సంవత్సరాలుగా ఏనుగులు కర్ణాటక రాష్ట్రం నుంచి గుంపులవారీగా వచ్చి చిత్తూరు జిల్లాలో నష్టంకలిగి స్తున్నాయని వాటినుంచి రక్షణ కల్పించాలని కోరారు.

వరి పొలాలను కాపాడుకోవాలి

ప్రజాశక్తి -తవణంపల్లి: వరి పొలాలను రైతులు కాపాడుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. చిత్తూరు జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల పంటల పరిస్థితిని పరిశీలించేందుకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి, శాస్త్రవేత్తలు, జిల్లా ఏరువాక కేంద్రం చిత్తూరు, (డాట్ సెంటర్), కోఆర్డినేటర్ డా. ఏ రామకృష్ణారావు, డా. ఎన్. వి.సరళ, డా. బి. వజంత, డా. పి నాగమణి, డాక్టర్ హారతి, మండల వ్యవసాయ అధికారి, తవణంపల్లి, జి ప్రవీణ్, రైతు సేవా కేంద్రాలు వీ.ఏ.ఎ, నవీన్ సంయుక్తంగా కలిసి తవణంపల్లి మండలం లోని నల్ల శెట్టిపల్లి, ఉత్తర బ్రాహ్మణపల్లి పుణ్య సముద్రం గ్రామాలలో దెబ్బతిన్న వరి పొలాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

దుష్ప్రచారాలపై ఖండన



ప్రజాశక్తి - రొంపిచర్ల: టిడిపి పుంగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి మీద గత కొన్ని రోజులుగా వస్తున్న దుష్ప్రచారాలకు రొంపిచర్ల మండలం చెంచమరెడ్డి గారి పల్లి గ్రామ పంచాయతీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు. చల్లా బాబు మీద సోషియల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలు పూర్తిగా అవాస్తవం అని, ప్రజలకి తెలుసు వారి నిజాయతీపై తాటాకు చప్పుళ్లకు టిడిపి నాయకులు, కార్యకర్తలు భయపడరన్నారు. 'లక్షలాది ప్రజలు కార్యకర్తలు వారి వెంట ఉన్నారు. దీని వెనుక ఎవరు ఉన్నా ఖబడ్దార్ ఎవరిని వదలం..' అని తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రగిరి మనోజ్ కుమార్, గూడూరు హరిబాబు, చంద్రగిరి సురేంద్ర, దేవలపల్లి చెంగల్ రెడ్డి, చంద్రగిరి మాధవ రావు ,సిబ్బాల ఈశ్వర, చంద్రగిరి అశ్విన్ కుమార్ ,చంద్రగిరి పవన్ కుమార్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

కారు బోల్తా
ప్రయాణికులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : ద్విచక్రవాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే వున్న బురద గుంటలో పడి న సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఎం.కొత్తూరు నుంచి చెన్నైకి వెళుతున్న కారు తడుకుపేట వద్ద జాతీయ రహదారి పనులు కొనసాగుతున్న ప్రాంతంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి పక్కనే వున్న బురదగుంటలో బోల్తా పడింది. స్థానికులు దీన్ని గమనించి పరుగున వెళ్లి కారులో ఉన్న వారిని బయటకు తీసి రక్షించారు. అదృష్టవశాత్తు లోపలున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అందరూ కలసి అతికష్టం మీద కారును బయటకు తీశారు.

ఒకే రాత్రి మూడు ఇళ్లలో చోరీ

ప్రజాశక్తి-విజయపురం: స్థానిక మండలంలోని జగన్నాథపురంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు మూడిళ్లలో చోరీకి యత్నించారు. రిటైర్డు ఆర్మీ అధికారి మోహన్ కుమార్ తిరుపతిలో నివాసం ఉంటున్నారు. ఆయన అప్పుడప్పుడూ సొంత గ్రామం జగన్నాథపురం వచ్చి వెళ్లేవారు. ఆ ఇంటిలో ఎవరూ లేరని భావించి దొంగలు చోరీకి ప్రయత్నించారు. కానీ ఇంట్లో విలువైన వస్తువులు లేకపోవడంతో పక్కనే ఉన్న మంజుల ఇంట్లోకి ప్రవేశించారు. ఆమె తిరుపతిలో ఉన్న వాళ్ల కొడుకు ఇంటికి వెళ్లిన సమయంలో దొంగలు చొరబడి ఒక లక్ష రూపాలు చోరీ చేశారని ఆమె తెలిపింది. అంతేకాకుండా రెండిళ్ల తర్వాత ఉన్న శ్యామలమ్మ ఇంట్లో చోరీకి ప్రయత్నించారు. కానీ అక్కడ ఏమి లభించలేదు. చిత్తూరు నుంచి క్లూస్ టీం సంఘటన స్థలానికి వచ్చి దొంగతనం చేసిన వారి ఫింగర్ ప్రింట్స్ఆధారాలు సేకరించి దొంగతనానికి పాల్పడ్డ వారిని త్వరలోనే వారిని పట్టుకుంటామని తెలిపారు.

మద్యం మత్తులో దాడి
వ్యక్తిపై కేసు నమోదు



ప్రజాశక్తి -విజయపురం: స్థానిక మండలంలోని ఎల్లసముద్రం గ్రామంలో మద్యం మత్తులో దంపతులపై దాడి మున స్వామి(57), అంజల(45) దాడి చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసు కథనం మేరకు.. ఒంటరిగా పశువులను మేపు తున్న మునస్వామిపై మద్యం సీసా పగలగొట్టి చేతి వెళ్లపై, వీపుపై రక్తగాయాలు ఏర్పరచడంతో అతని భార్య అడ్డుకోవడానికి ప్రయత్నించింది. ఆమె చేతిపై కూడా పగిలిన సీసాతో రక్త గాయాలు ఏర్పరచారు. గాయపడిన వారిని నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. నింద్ర మండలం నెట్టేరి ఆదిఆంధ్రవాడకు చెందిన నరేష్, రాజేష్ కొంత కాలంగా ఎల్లసముద్రం ఆదిఆంధ్రవాడలో నివాసం ఉంటున్నారని, కొన్ని రోజుల క్రితం మునస్వామితో విభేదాలు చోటుచేసుకుందని, ఆ కక్షతోనే దాడి చేసినట్టు తెలిపారు. దాడి చేసిన వ్యక్తితో పాటు నింద్ర మండలం పాదిరికి చెందిన జీవేష్, వెంకటేష్, తమిళనాడు అరక్కోణంకు చెందిన యోగేష్ ఉన్నారని, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మహేష్ బాబు తెలిపారు.

మద్యం, గంజాయి మత్తులో దాడి చేశారు..

మద్యం, గంజాయి మత్తులో నాపై దాడి చేశారని బాధితుడు మునస్వామి ఆరోపించారు. గతంలో పొలాలలో ఆవులు మేస్తున్న దగ్గర 'మీకు ఏమి?' అంటూ ప్రశ్నిస్తే అప్పుడు కూడా దాడి చేయడాని ప్రయత్నించారని, రాత్రి పగలు తేడా లేకుండా రోడ్డుపైనే వీరవిహారం చేస్తారని, రోడ్డు నుండి ఇంటికి వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నామని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

భద్రతకు ముమ్మర చర్యలు: సీఐ



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: తుపాన్ ప్రభావం నేపథ్యంలో ప్రజల భద్రత కోసం ముమ్మర చర్యలు తీసుకుంటున్నట్లు పలమనేరు రూరల్ సీఐ పరశు రాముడు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వంకలు, వాగులు, పాత భవనాలు, విద్యుత్ స్తంభాలు, రోడ్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. 28, 29, 30 తేదీలలో వర్షాలు, గాలులు తీవ్రంగా వీసే అవకాశం ఉండటంతో అవసరమైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఎటువంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా 100, 112, 108 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రాధాన్యత అని, ఎవ్వరూ నిర్లక్ష్యం చేయకూడదని తుపాన్ సమయంలో బయటకు వెళ్లకుండా, విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

ఉత్తమ సేవలు అందిస్తా
ఏపీ వెలుగు వివోఏ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రబాబు

ప్రజాశక్తి -గంగవరం (పలమనేరు రూరల్): తాను ఉత్తమ సేవలు అందిస్తానని ఏపీవెలుగు వీవోఏ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రబాబు పేర్కొన్నారు. కాణిపాకంలో నిర్వహించిన చిత్తూరు జిల్లా ఏపీ వెలుగు వి ఓఏ ఉద్యోగుల సంఘం మూడవ మహాసభలో గంగవరం మండలం సంఘమిత్ర చంద్రబాబును జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు మండల సంఘమిత్రలు, యూనియన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో తనకు అప్పగించిన పదవికి న్యాయం చేస్తానని ఎల్లవేళలా సంఘ మిత్రుల కు అండగా ఉంటూ సేవలు అందిస్తానన్నారు. తనకి ఈ బాధ్యతలు అప్పగించిన యూనియన్ సభ్యులకు అభినందనలు తెలిపారు.

IN THE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE COURT AT PUTTUR.
O.S. No. 374/2024.

BETWEEN:-
K. Jayaprakash ...Plaintiff.
AND:-
K. Jagadeeshan Achari and others ...Defendants

SUMMONS TO DEFENDANTS NO. NO. 1. 2. 4 TO 6. 8 AND 9

DEFENDANTS NO. NO. 1. 2. 4 TO 6, 8 AND 9:-
1. K. Jagadeeshan Achari, S/o Late Thyagaraya Achari, Hindu, aged about 65 years, Ex-Army,
2. K. Ponnuswamy, S/o Late Thyagaraya Achari, Hindu, aged about 63 years, Business,
4. K. Gunasekhar, S/o Late Thyagaraya Achari, Hindu, aged about 59 years, Business,
5. K. Navaneetha, D/o Late Thyagaraya Achari, W/o Not know, Hindu, aged about 56 years, Housewife,
6. K. Neelakantan, S/o Late Thyagaraya Achari, Hindu, aged about 53 years, Private Employee.
8. K.Prasad, S/o Late Govinda Achari, Hindu, aged about 36 years, Carpenter,
9. K. Jagadha, W/o K. Narasimhulu Mandadi, Hindu, aged about 69 years, Housewife. No. 1, 2, 4 to 6, 8 & 9 are residing at Palasamudram Village and post & Mandal, Chittoor Dist. **...Defendants No. 1, 2, 4 to 6, 8 & 9**

Please take summons that, the above case was filed by the plaintiff as against all you and others for permanent injunction in the above court and the same is posted on: 04.11.2025. Hence you are here by directed to attend before the above court at about 10-30 A.M. either by person or through Advocate. Otherwise the above case will be decided an exparty.

Hg. date:04.11.2025

G . Raja Reddy, B.Com, LL.B.
P. Kumarvel, B.com, L.L.B.
Advocates Puttur.